"అది అద్భుతం. ఆ పుణ్యం వల్ల నీకు మూడు పాయింట్లు లభించాయి. ఇంకా?" అడిగాడు యముడు.

"నిత్యం హనుమంతుడి గుడికి వెళ్ళి హనుమాన్ చాలీసాని రోజుకి పదకొండు సార్లు చదువుతాను."

"ఈ పుణ్యం వల్ల నీకు రెండు పాయింట్లు లభించాయి. తర్వాత?" అడిగాడు యముడు.

"నేను నా పాతబట్టలన్నీ మా ఊళ్ళోని అనాథ శరణాలయానికి ఇస్తూంటాను."

"బావుంది. నీకు మరో రెండు పాయింట్లు లభించాయి."

"ఇంత పుణ్యం చేసినా నాకు పట్టుమని పది పాయింట్లు కూడా రాలేదు. ఇక నేను స్వర్గానికి వెళ్ళాలంటే దేవుడి దయ మీద ఆధారపడాలి." నిస్పృహగా చెప్పాడు అతను.

"మహాద్భుతం! ఆ మాటలకి నీకు వంద పాయింట్లు లభించాయి. నువ్వు స్వర్గానికి వెళ్ళచ్చు." చెప్పాడు యముడు వెంటనే.

## 91. బహుమతి

రంగారావు నాస్తికుడు. స్వయంకృషి మీద తప్ప అతనికి దైవం మీద, ఆయన కృప మీద నమ్మకం లేదు. అతని పుట్టిన రోజుకి ఓ మిత్రుడు జేబులో పట్టే ఓ భగవద్గీతని ఇచ్చి చెప్పాడు.

"బస్ కోసం వేచివున్నప్పుడు, లేదా క్యూలో వేచి ఉన్నప్పుడు సమయం వృథా కాకుండా దీన్ని చదువుతూండు. అలా మొత్తం ఓ సారి చదివాక నీకు ఇది నచ్చకపోతే దీన్ని చెత్త డబ్బాలో పడేయి."

ఆ రాత్రి అతని మిత్రుడు భగవద్గీతని బోధించిన కృష్ణుడ్ని 'రంగారావులో దేవుడి మీద నమ్మకం కలిగించమని' మనస్ఫూర్తిగా ప్రార్థించాడు.

మర్నాడు ఉదయం రంగారావు కూరల బండిలోని కూరలని కొనడానికి బయటకి వచ్చినప్పుడు గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు అతని మీద కాల్పులు

జరిపారు. ఓ గుండు గురి తప్పింది. మరొకటి అతని చొక్కా జేబులోకి దిగింది. అతని మిత్రుడు కానుకగా ఇచ్చిన భగవద్గీత గుండెకి అడ్డుగా ఉండటంతో గుండు అందులో దిగి ఆగిపోయింది.

దేవుడు తనని ఆ విధంగా ఓ అద్భుత సంఘటన ద్వారా కాపాడటం అతనికి ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆ రోజునించి నాస్తికుడు అయిన రంగారావు ఆస్తికుడు అయ్యాడు.

## 92. దేవుడికి వదులు

ఓ రాజు తన మంత్రులతో కూర్చుని ప్రపంచాన్ని బాగు చేయడానికి ఏం చర్యలు చేపట్టాలా అని కొద్ది రోజులుగా అదే పనిగా మంతనాలు జరుపుతున్నాడు. ఈ సంగతి తెలిసిన రాజ గురువు రాజు దగ్గరకి వచ్చి అడిగాడు.

"రాజా! ఈ ప్రపంచాన్ని నడిపించేది ఎవరో నీకు తెలుసా?"

"తెలుసు గురుదేవా! దేవుడే ఈ ప్రపంచాన్ని నడిపించేది." జవాబు చెప్పాడు ఆ రాజు.

"నువ్వు పుట్టక మునుపు?"

"దేవుడే."

"నువ్వు మరణించాక?"

"దేవుడే నడిపిస్తాడు."

"అంటే నువ్వు పుట్టక మునుపు, నీ తదనంతరం ఈ ప్రపంచాన్ని దేవుడే నడుపుతాడంటావు?"

"అవును గురుదేవా."

"మరి నువ్వు జీవించి వున్నప్పుడు కూడా ఆ భారాన్ని దేవుడికే వదలక ఎందుకు ఈ ప్రపంచాన్ని ఉద్ధరించాలని సతమతమవుతున్నావు?" నవ్వుతూ ప్రశ్నించాడు గురువు.

రాజుకి గురువు బోధ అర్ధమైంది. ప్రపంచం సంగతి మాని తన దేశ ప్రజల గురించే అప్పటి నించి ఆలోచించసాగాడు.